క్లుప్తంగా

నేడు యనమలకుదురుకు మాజీ ఉపరాష్ట్రపతి రాక

పెనమలూరు: యనమలకుదురు గ్రామానికి ఆదివారం మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు వస్తున్నారని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు తెలిపారు. ఆయన శనివారం విలేకరులకు వివరాలు తెలుపుతూ ఉదయం 10 గంటలకు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారని చెప్పారు.

గొల్లనపల్లిలో ఎన్‌ఎస్‌ఓ క్షేత్రస్థాయి సర్వే



గన్నవరం రూరల్: గొల్లనపల్లిలో నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ ఆధ్వర్యంలో శనివారం క్షేత్రస్థాయి సర్వే జరిగింది. ఈ నెల 17వ తేదీ వరకూ జరిగే సర్వేను ఎన్యూమరేటర్ బి.రవికుమార్ పర్యవేక్షిస్తున్నారు. క్షేత్రస్థాయిలో కుటుంబాలు వినియోగించే ఆహారం, బియ్యం, పప్పులు, పండ్లు ఇతరత్రా తినే ఖర్చులను సేకరించారు. విద్యుత్ వినియోగం, గ్యాస్, ఎడ్యుకేషన్, మెడికల్ తదితర ఖర్చులను రెండో అంశంగా నమోదు చేశారు. మూడో ప్రాధాన్యతగా ఏసీలు, ఫ్రిజ్‌లు తదితర దీర్ఘకాలం వినియోగించే వస్తువుల ఖర్చులు, మెయింటెన్స్ గ్రామస్తులను అడిగి రికార్డు చేశారు. గ్రామ స్థాయిలో కుటుంబాల ఖర్చుల వినియోగం నమోదు చేసేందుకు గొల్లనపల్లిని ఎంపిక చేసినట్లు రవికుమార్ తెలిపారు. ఎన్ఎస్ఓ సూచనల మేరకు సిబ్బంది వలంటీర్ల సాయంతో సర్వే చేస్తున్నామన్నారు.

రక్తస్రావం లేని రోబోట్ సర్జరీలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోబోటిక్ శస్త్ర చికిత్స ద్వారా చికిత్స సయంలో రక్తస్రావం తక్కువగా ఉంటుందని ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ కాసరనేని ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రోబోటిక్ శస్త్ర చికిత్సల కోసం ప్రశాంత్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డావిన్స్ ఎక్స్ సర్జికల్ రోబోట్‌ను ఆదివారం మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా లబ్బీపేటలోని తమ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడారు. శరీరంపై చిన్న గాటు మాత్రమే పెట్టి రోబోట్ సర్జరీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రోబోటిక్ సర్జరీతో తక్కువ నొప్పి, పెయిన్ కిల్లర్స్ వాడకం తగ్గించడం, రికవరీ రేటు వేగంగా ఉండటం దీని ప్రత్యేకతగా తెలిపారు. యూరాలజీతో పాటు, గర్భకోశ వ్యాధులకు రోబోటిక్ సర్జరీలు చేయనున్నామన్నారు. డాక్టర్ దీరజ్, డాక్టర్ ప్రియతమ్, డాక్టర్ హరిత, డాక్టర్ బి.శ్వేత తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఉంగుటూరు: ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఈ నెల 12వ తేదీన ట్రస్ట్, రమేష్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో గుండె, మెదడు, కీళ్లు, ఎముకలు, ఊపిరితిత్తులు, సాధారణ వ్యాధులు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ర్యాండమ్ షుగర్, బీపీ, ఈసీజీ, ఎకో, ఎముకల దృఢత్వ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలకు వచ్చే వారికి, వారి సహాయకులకు ఉచిత భోజన సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా రాజేష్

రామవరప్పాడు: రూరల్ మండలం వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్‌తో పాటు కో కన్వీనర్లుగా మరో నలుగురిని నియమిస్తూ శనివారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. రూరల్ మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా నిడమానూరుకు చెందిన పెనుమాక రాజేష్, కో కన్వీనర్లుగా రామవరప్పాడుకు చెందిన మత్తె కిరణ్, ప్రసాదంపాడుకు చెందిన కలపాల విజయ్‌కుమార్, నున్నకు చెందిన బెతపూడి గోపి, అంబాపురానికి చెందిన శ్రీకాంత్ నాయుడు నియమితులయ్యారు.

దంత వైద్య విద్యార్థులకు ఫేస్ పెయింటింగ్ పోటీలు



గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్దార్థ దంత వైద్య కళాశాలలో శనివారం దంత వైద్య విద్యార్థులకు ఫేస్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. అసోసియేషన్ ఆఫ్ ఓరల్ అండ్ మాక్సిలో ఫేషియల్ సర్జన్ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ ఆధ్వర్యాన జరిగిన పోటీలను హెచ్‌ఓడీ డాక్టర్ కోటేశ్వరరావు పర్యవేక్షించారు. విద్యార్థుల్లోని సృజన వెలికితీసేందుకు పోటీలు దోహదం చేస్తాయని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, ఏట వై.మధుసూదనరావు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.



పొట్టేళ్ల ప్రభబండితో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు



విద్యుత్ కాంతులతో శోభాయమానంగా వీరమ్మతల్లి ఆలయ ప్రాంగణం



విద్యుత్ కాంతులతో ఉయ్యూరు పట్టణం

ఊరంతా ఉత్సవం

వీరమ్మతల్లి తిరునాళ్లలో పన్నెండో రోజు శనివారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. తిరునాళ్ల ముగింపు దగ్గర పడుతుండటంతో అధిక సంఖ్యలో భక్తజనం తిరునాళ్లకు వచ్చి డప్పు వాయిద్యాలతో పొట్టేళ్ల ప్రభ బండిని ఊరేగించి తల్లికి కానుకగా సమర్పించి భక్తిపారవశ్యం చెందారు. మార్కెట్‌యార్డు నుంచి జేఎస్ఎస్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తరలివెళ్లి చల్లని తల్లికి యువత మొక్కులు చెల్లించారు. అమ్మవారిని కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావు కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. విద్యుత్ కాంతులతో పట్టణంతో పాటుగా ఆలయ ప్రాంగణం శోభాయమానంగా మారింది. ఊరంతా ఉత్సవ శోభ కనిపించింది

–ఉయ్యూరు

రామలింగేశ్వరుడి ఆలయం ముస్తాబు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రామంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పెద్ద ఎత్తున చేయడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి దాదాపు లక్షమంది భక్తులు మహాశివరాత్రికి వచ్చి రామలింగేశ్వరస్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం ప్రభ మహోత్సవంలో పాల్గొని జాగారం చేస్తారు.

సర్వాంగ సుందరంగా..

మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆంజనేయస్వామి 50 అడుగుల విగ్రహానికి రంగులు వేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు, మెట్ల మార్గంలో కూడా రంగులు వేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల అవసరాలకు చలవ పందిళ్లు వేశారు. పూజలు చేసే ప్రాంగణంలో మరమ్మతులు చేపట్టారు. ఆలయ ప్రధాన ద్వారానికి



సిద్ధమవుతున్న రాతిచక్రాల దేవుడి ప్రభరథం

కూడా రంగులు వేశారు. రోడ్డు మార్గం మరమ్మతులతో సిద్ధం చేశారు.

కొత్త రాతిచక్రాల రథం..

స్వామివారి ప్రభ ఊరేగించడానికి కొత్త రాతి చక్రాల రథం సిద్ధం చేశారు. రథానికి రంగులు వేశారు. ప్రభలకు తెలంగాణ నుంచి వెదురు కర్రలు తీసుకువచ్చారు. రెండు రోజుల్లో పూజలు చేసి ప్రభ నిర్మాణం చేపడతారు. ఈ నెల 18వ తేదీ రాత్రి 2.34 గంటలకు స్వామి వారి కల్యాణం చేస్తారు.



ఆలయంలో ఆంజనేయ స్వామి విగ్రహానికి కొత్త రంగులు

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

పెనమలూరు: పేదలకు ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాల్లో లబ్ధిదారులు గృహాల నిర్మాణం పూర్తి చేయాలని ఎంపీడీఓ సునీతాశర్మ అన్నారు. ఆమె శనివారం పెనమలూరు లేఅవుటులో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా పెనమలూరు లేఅవుటులో మొత్తం 439 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిందన్నారు. ఇందులో ఇప్పటికి 271 మంది గృహాల నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఇంకా 168 మంది లబ్ధిదారులు గృహాల నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. ప్రభుత్వం గృహానికి రూ 1.80 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. లబ్ధిదారులు ఇళ్లు పూర్తి చేసి గృహ యజమానులుగా మారి జగన్న కల సాకారం చేయాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జీఎస్‌వీ రాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వణుకూరులో

వణుకూరు లేఅవుట్‌లలో జగనన్న గృహాల నిర్మాణం పూర్తి చేయాలని తహసీల్దార్ టీవీ



పెనమలూరు జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సునీతాశర్మ

సతీష్ అన్నారు. ఆయన శనివారం వణుకూరు లేఅవుటు 1, 2లో సందర్శించారు. ఇప్పటికే చాలా ఇళ్ల నిర్మాణం చివరి దశలో ఉన్నాయన్నారు. ఏపీఎం నుంచి రూ 50 వేల రుణం వెంటనే అందజేస్తామని తెలిపారు. వచ్చే రెండు వారాల్లో గృహ ప్రవేశాలు చేయాలని సచివాలయ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతాశర్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లలిత కళలతో మనో వికాసం



కార్యక్రమాలు ప్రారంభిస్తున్న వేదాంతం రాధేశ్యాం, సప్పా శివకుమార్, ఘంటసాల పవన్‌కుమార్



కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

విజయవాడ కల్చరల్: సంప్రదాయ నృత్య కళలను సంరక్షించుకోవాలని కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత వేదాంతం రాధేశ్యాం అన్నారు. వాగ్దేవీ నృత్యాలయ ఆధ్వర్యంలో రెండురోజులపాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి నృత్య నీరాజన కార్యక్రమం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ప్రారంభించిన రాధేశ్యాం మాట్లాడుతూ లలితకళలు మనోవికాసం కలిగిస్తాయని చెప్పారు. వాటిని అధ్యయనం చేయాల్సిన అవసరముందన్నారు. నాట్యాచార్యుడు సప్పా శివకుమార్ మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని వారి ప్రదర్శనలకు హద్దులు లేవని పేర్కొన్నారు. దేశ విదేశాల్లో సైతం మన కళల పట్ల మక్కువ చూపిస్తునట్లు తెలిపారు. కూచిపూడి నాట్యాచార్యుడు ఘంటసాల పవన్‌కుమార్ మాట్లాడుతూ కూచిపూడి గ్రామం నేడు ప్రపంచ వ్యాప్తంగా తన ఉనికిని చాటుకుంటోందన్నారు. జీఎస్‌టీ ఆఫీసర్ వీజీవీవీడీస్ కుమార్, డి.శంకరరావు, మాగలూరి త్రినాధాచారి, పెదప్రోలు భావన, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా నృత్య ప్రదర్శనలు...

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాట్యాచార్యులు యల్లా జోస్యుల అనూరాధ, వేదాంతం రామశాస్త్రి, వెంకటలక్ష్మి, నరేంద్రకుమార్, చెన్నా తన్మయి, సట్టు వేణుగోపాల్, పాకలజ్యోతి భరత్ తమ బృందాలతో కూచిపూడి, భరతనాట్యంలోని సంప్రదాయ కీర్తనలకు నృత్యాలు అభినయించారు. నాట్యరంగంలో ప్రతిభ చూపిన కళాకారులకు వెంకటేశ్వర, నటరాజ పురస్కారాలతో సత్కరించారు.

తెలుగు వారి ఆత్మబంధువు ఘంటసాల

విజయవాడ కల్చరల్: తెలుగు వారి ఆత్మబంధువు ఘంటసాల అని ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. ప్రభుత్వ సంగీత కళాశాల ఆధ్వర్యంలో శనివారం ఘంటసాల వర్ధంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లాది విష్ణు మాట్లాడుతూ ఘంటసాల స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని తెలిపారు. ఆయన పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న సంగీత కళాశాల జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుందని చెప్పారు. ఎందరో సంగీత విద్వాంసులు ఇక్కడే రూపు దిద్దుకున్నట్లు పేర్కొన్నారు. ఘంటసాల విగ్రహానికి పూలమాలతో ఘనంగా నివాళి సమర్పించారు. కార్పొరేటర్ కొండాయిగుంట మల్లీశ్వరి, కళాశాల అధ్యాపకురాలు విష్ణుబొట్ల కృష్ణవేణి, అధ్యాపరేతర సిబ్బంది, వివిధ సంస్థల ప్రతినిధులు డేవిడ్‌రాజు, చింతకాయల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘంటసాల వర్ధంతి సంస్థ అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు వారు ఉన్నంత వరకు ఘంటసాల స్వరం నిలిచిపోతుందన్నారు. కళాక్షేత్రంలో ఘంటసాల విగ్రహాన్ని తమ సంస్థ ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తునట్లు తెలిపారు. గోళ్ల నారాయణరావు, డి. శంకరరావు, శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.



ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సమర్థంగా 'ఫ్యామిలీ ఫిజీషియన్'

కృష్ణా జిల్లా వైద్య శాఖాధికారి గీతాభాయి

గన్నవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ జి.గీతాభాయి సూచించారు. శనివారం మండలంలోని సూరంపల్లి ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారి వివరాలను ఫ్యామిలీ ఫిజిషియన్ యాప్‌లో నమోదు చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. పథకంపై గ్రామాల్లో క్షేత్ర స్థాయి సిబ్బంది విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. వైద్యానికి వచ్చే గర్భిణులు, దీర్ఘకాలిక రోగులు మెడికల్ రిపోర్టులు తీసుకువచ్చే విధంగా వారిలో చైతన్యం కల్పించాలన్నారు. ప్రజలకు స్థానికంగానే ఉన్నత వైద్యం అందించేందుకు రూపొందించిన ప్రక్రియ ఇది అని చెప్పారు. బెడ్లపై ఉండి కదల్లేని రోగులకు సైతం వారి ఇంటి వద్దే వైద్యం అందిస్తామని చెప్పారు. చిన్న పిల్లలకు, క్రానిక్ డిసీజ్‌లు ఉన్నవారికి ఫ్యామిలీ ఫిజిషియన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



సూరంపల్లిలో ఫ్యామిలి ఫిజీషియన్ యాప్ పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో గీతాభాయి

వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ముస్తాబాద పీహెచ్‌సీ వైద్యుడు శివప్రసాద్‌తో డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ ఓపీ మరింతగా పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. టెస్టులు పర్యవేక్షించాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ స్వరూప రాణి, ఏఎన్ఎం లక్ష్మి, ఎంపీహెచ్‌ఈఏఎం డి.సాంబశివరావు, ఆశాలు స్వర్ణలత, అంగిరేకుల నిర్మలకుమారి పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు మెరుగైన సేవలు



దావాజిగూడెం(గన్నవరం): డ్వాక్రా సంఘాలకు మెరుగైన సేవలందించాలని ఎంఈఎఫ్ నేతలు కోరారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నికైన దేవరపల్లి సుశీలను శనివారం ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. దావాజిగూడెంలో సుశీల, ఏసుబాబు దంపతులను పాలిటెక్నిక్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర నేతలు ఎలీషా, ఎంఈఎఫ్ నేతలు కోటేశ్వరరావు, జయరాజు తదితరులు శాలువాలు కప్పి సన్మానించారు. గన్నవరం సర్పంచి నిడమర్తి సౌజన్య, న్యాయవాది తిరివీధి వెంకయ్య, ఆంధ్రా బ్యాంక్ మేనేజర్ దేవరపల్లి జయరాజు, ఎస్టీయూ నాయకులు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రయాణికులకు దర్శనం టికెట్లు

గన్నవరం: ఆర్టీసీ బస్సుల్లో ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలానికి రిజర్వేషన్ చేసుకునే ప్రయాణికులకు శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం, స్పర్శదర్శనం టికెట్లు కూడా పొందవచ్చాని గన్నవరం డిపో మేనేజర్ పి. శివాజీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్సు టికెట్ తీసుకునేటప్పుడు ఆన్‌లైన్‌లో గాని, ఏజెంట్ల వద్ద దర్శనం టిక్కెట్ కూడా రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా రోజుకు 800 దర్శనం టికెట్లు ఆర్టీసీ ప్రయాణికులకు కేటాయించినట్లు తెలిపారు. శ్రీమల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్లే ఆర్టీసీ ప్రయాణికులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

హనుమాన్‌జంక్షన్(గన్నవరం): బాపులపాడు మండలంలోని కోడూరుపాడు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడ్డారు. గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన కలపాల వెంకట్రామయ్య, అతని భార్య ప్రమీల కాంక్రీట్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం సమీపంలోని దువ్వాడలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వెళ్లిన భార్యాభర్తలు తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మండలంలోని కోడూరుపాడు వద్ద సర్వీస్ రోడ్డులో వెళ్తున్న వీరిని ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీకొట్టింది. ఘటనలో వెంకట్రామయ్య, ప్రమీలకు తీవ్రగాయాలు కావడంతో 108లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై వీరవల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్రకారుడు జగన్‌మోహనరావుకు జాతీయ అవార్డు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గిరిజనుల జీవనశైలితోపాటు పలు సామాజిక అంశాలపై అనేక చిత్రాలను కాన్వాస్‌పై మలిచిన గీత శిల్పి, భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీకి చెందిన డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావుకు 'ఇండియన్ ప్రెస్టీజియస్ హానర్' అవార్డు లభించింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన 'డ్రీమ్ పెయింట్ బ్రష్' సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో గిరిజన మహిళల జీవన విధానాన్ని ప్రతిబింబిస్తూ తాను గీసిన చిత్రానికి ఈ అవార్డు దక్కిందని చిత్రకారుడు డాక్టర్ జగన్‌మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఈ జాతీయ అవార్డ్ తనకు లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దానిని శనివారం పోస్ట్ ద్వారా అందుకున్నట్లు తెలిపారు. వివిధ సామాజిక అంశాలపై సుమారు 1000కుపైగా చిత్రాలను గీసిన తనకు వందకు పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజన జీవితాలను ప్రపంచానికి తెలియ చెప్పాలనే లక్ష్యంతోనే వారి జీవన శైలికి సంబంధించిన చిత్రాలను గీస్తున్నానని వెల్లడించారు. గిరిజనుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. చిత్రకళ సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని, చిత్రకారులు ఆ దిశగా చిత్రాలను గీయాలని సూచించారు. డాక్టర్ బొండాకు ఈ అవార్డ్ లభించడంపట్ల పలువురు చిత్రకారులు, సన్నిహితులు ఆయనకు అభినందనలు తెలిపారు.

విద్యాప్రదాత వీఎల్ దత్

పెనమలూరు: వేలాది మంది విద్యార్థులకు ఉత్తమ భవిత అందించిన విద్యాప్రదాత డాక్టర్ వీఎల్ దత్ అని ది కేసీపీ లిమిటెడ్ (చెన్నై) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వీఎల్ ఇందిరాదత్ అన్నారు. కానూరు సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలకు డాక్టర్ వీఎల్ దత్ నామకరణం చేసిన సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. మూడు దశాబ్దాలుగా సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో వేలాది మంది విద్యార్థులు చదివి నేడు ఉన్నత స్థానాల్లో ఉండటం గర్వకారణమన్నారు. ఎంతో మంది కోరినా ఆయన విద్యాలయాలకు తన పేరు పెట్టడానికి అంగీకరించలేదన్నారు. ఆయన మరణానంతరం సిద్ధార్థ అకాడమీ విజ్ఞప్తితో నేడు వీఎల్ దత్ పేరు నామకరణం చేశామని వివరించారు.

వీఆర్ సిద్ధార్థ కాలేజీలో..

కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఒక భవనానికి వీఎల్ దత్ పేరును నామకరణ చేశారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు



కానూరులో వీఎల్ దత్ పాఠశాలగా నామకరణం చేస్తున్న ఇందిరాదత్

లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యా రంగానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు చదలవాడ నాగేశ్వరరావు, సభ్యులు మల్లినేని రాజయ్య, వెల్లంకి నాగభూషణం, లలితప్రసాద్, వెంకటేశ్వరరావు, వీరపనేని శశికళ, ప్రిన్సిపాల్స్ ఏవీ రత్నప్రసాద్, మనోజ్ కర్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రాలపై అప్రమత్తం

డాక్టర్ సుందర్‌కుమార్

కంకిపాడు: నేత్రాలపై అప్రమత్తంగా ఉండాలని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి సుందర్‌కుమార్ అన్నారు. ఉప్పలూరు పీహెచ్‌సీలో శనివారం కంటి పరీక్షల ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే కంటి సమస్యలను గుర్తించి వైద్యం చేయించుకోవాలన్నారు. ఉప్పలూరు పీహెచ్‌సీలో మెరుగైన కంటి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. 140 మంది రోగులకు ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ కంటి పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాచమళ్ల శ్యాంప్రసాద్, పీహెచ్ఎన్ పద్మావతి, హెచ్‌వీ శారమ్మ, సిబ్బంది పి.ఆదిలక్ష్మి, కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలూరు పీహెచ్‌సీలో కంటి వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ సుందర్‌కుమార్

బాల్య వివాహాలను నివారించాలి

పెనమలూరు: బాల్య వివాహాలను నివారించాలని అంగన్‌వాడీ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.రమానాగమణి అన్నారు. వణుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

18 సంవత్సరాలు నిండనిదే బాలికలకు వివాహం చేయకూడదన్నారు. చట్టాన్ని అతిక్రమించి వివాహాలు చేస్తే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. బాల్య వివాహాల నిర్మూలనకు హెల్ప్‌లైన్ 100, 121, 181, 1098 ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



వణుకూరులో మాట్లాడుతున్న రమానాగమణి

ఎయిర్‌పోర్ట్‌లో రాకేష్ తికాయత్‌కు స్వాగతం

విమానాశ్రయం(గన్నవరం): కిసాన్ సంయుక్త మోర్చా జాతీయ నాయకులు రాకేష్ తికాయత్‌కు శనివారం గన్నవరం విమానాశ్రయంలో పలువురు రైతు సంఘాల నేతలు స్వాగతం పలికారు. విజయవాడలో జరగనున్న రైతు సదస్సులో పాల్గొనేందుకు ఆయన న్యూఢిల్లీ నుండి రాత్రి ఇక్కడికి చేరుకున్నారు.

